


www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

గురువారం | 06 | ఆగస్టు | 2026 | పేజీలు: 08




# గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు

భద్రాచలం, అక్షిత న్యూస్: దేశ విదేశాల నుండి భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దర్శనానికి లక్షలాది మంది భక్తులు భద్రాచలం వస్తూ ఉంటారని భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యం కోసం రెండవ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం భద్రాచలం విచ్చేసిన మంత్రి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు తో కలిసి భద్రాచలంలోని గోదావరి నది రెండో బ్రిడ్జి అప్రోచ్ పనులను ఆయన పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులను పనుల పురోగతి పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులు వేగవంతం చేసి ఈ నెలలోనే ఈ బ్రిడ్జిపై రాకపోకలు పునరుద్ధరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాముని దర్శనానికి లక్షలాదిమంది భక్తులు భద్రాచలం వస్తూపోతూ ఉంటారని, వచ్చే ఏడాదికి జరగబోయే ..మిగతా 2లో



# చెత్తరహిత మున్సిపాలిటీయే లక్ష్యం

## ఎమ్మెల్యే బిఎల్ఆర్



మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి: గాంధీ జయంతి నాటికి మిర్యాలగూడ మున్సిపాలిటీని చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మిర్యాలగూడ మున్సిపల్ సమావేశ హాలులో మున్సిపాలిటీ అమలు చేస్తున్న కార్యక్రమాలను స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ తో కలిసి సమీక్షించారు. చెత్త పేరుకు పోవడం వల్ల దోమలు, కుక్కల బెడద, వ్యాధులు పెరుగుతాయని, తద్వారా ప్రజలు ఇబ్బందులు పడతారని, అందువల్ల ..మిగతా 2లో



# నాణ్యతలో తేడాలొస్తే ఉపేక్షించం

## వేగిరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

## రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ విపి గౌతమ్

## ఘనంగా స్వాగతం పలికిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, అక్షిత ప్రతినిధి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిమితులకు లోబడి, నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ ఆదేశించారు. బుధవారం వనపర్తి జిల్లా వనపర్తి మండలం రాజపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మేనేజింగ్ డైరెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎండి ఆరా తీయగా.. గ్రామంలో మంజూరైన 34 ఇందిరమ్మ ఇళ్లకు 34 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు, ఇండ్లు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు హౌసింగ్ పీడీ వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎక్కువ ఎత్తుతో కూడిన బేస్మెంట్ నిర్మించుకోవడం ..మిగతా 2లో



# లబ్ధిదారుల ముంగిట ప్రగతి ఫలాలు

## అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలి

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల, అక్షిత బ్యూరో: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి ..మిగతా 2లో



# విద్యతో పాటు విజ్ఞానం

## సామాజిక విషయాల పట్ల అవగాహన కల్పించాలి

## విద్యార్థులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్,అక్షిత బ్యూరో: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ,బిసి మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలలో నిర్వహిస్తున్న స్ఫూర్తి ..మిగతా 2లో

# గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు

**మొదటి పేజీ తరువాయి...**

గోదావరి పుష్కరాలకు భక్తులు భద్రాచలం వచ్చే అవకాశం ఉందని, కనుక ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని త్వరగా పనులు పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.. 2015లో జరిగిన గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి వల్ల ట్రాఫిక్ సమస్యలు రావడంతో అమరావతి టు జగదల్పూర్ జాతీయ రహదారి భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండవ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు..

టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మాణం పనులు నత్తనడకగా సాగాయని మా ప్రభుత్వం వచ్చిన వెంటనే బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూసామని ఆయన చెప్పారు. వరదలు ఎన్ని వచ్చినా అప్రోచ్ రోడ్డు వరద కోతకు గురవకుండా పగడబందీగా రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులు జరుగుతున్నాయని ఈ నెల చివరి వరకు పనులు పూర్తి చేసి రెండవ బ్రిడ్జిపై రాకపోకలు జరిగేలా చూస్తామని తెలియజేశారు.

రెండవ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో ఆంధ్ర ప్రదేశ్ ఛత్తీస్గడ్ ఒడిస్సా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా మారిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు విజ్ఞానం

**మొదటి పేజీ తరువాయి...**

కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వర్ధన్నపేట గిరిజన బాలికల వసతి గృహంలో నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమంలో పాల్గొని విద్యతో పాటు విజ్ఞానం, చైతన్య పెంపొందించేలా మోటివేషన్ కల్పించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు మౌలిక సదుపాయాల గురించి నేరుగా వారితో మాట్లాడి తెలుసు కున్నారు. మధ్యాహ్న భోజనంలో అందుతున్న పౌష్టిక విలువలను నేరుగా విద్యార్థులతో కూర్చొని అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతలో తేడాలొస్తే ఉపేక్షించం



**మొదటి పేజీ తరువాయి...**

పరిమితికి మించి స్లాబ్ సైజు పెంచుకోవడం వంటివి చేయవద్దని సూచించారు. అలా చేస్తే నిర్మాణ ఖర్చు భారీగా పెరుగుతుందని సూచించారు. కాబట్టి లబ్ధిదారులు పరిమితులకు లోబడే నిర్మాణం చేపట్టాలని తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం లబ్ధిదారులు గంధం నాగమ్మతో పాటు మరో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను సందర్శించి, పరిశీలించి వారితో నేరుగా మాట్లాడారు. నిర్మాణ వ్యయం, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే ప్రస్తుతం మార్కెట్లో సిమెంట్ బస్తాలు, ఇనుప సామగ్రి ధరలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను ప్రభుత్వం రాయితీ ధరలకు లబ్ధిదారులకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై లబ్ధిదారుల అభిప్రాయాలను కూడా తెలుసుకుని నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ విటోభా, ఇతర అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెత్తరహిత మున్సిపాలిటీయే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

మున్సిపల్ అధికారులు సిబ్బంది పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. శానిటేషన్ సిబ్బంది తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని, సేకరించిన చేతను డంపింగ్ యార్డ్ కు తీసుకెళ్లి బయో మైనింగ్ చేయాలని ఆదేశించారు. జవాన్లు, సిబ్బంది ఇకపై ఆన్లైన్ అటెండెన్స్ ఇవ్వాలని, ఎవరు విధులకు హాజరు కాకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ కమిషనర్, వార్డు అధికారులు తప్పనిసరిగా వార్డులలో పర్యటించాలని, ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని, ప్రత్యేకించి మున్సిపాలిటీలో చెత్త వేసే ప్రదేశాలు ఉండరాదని, ప్రస్తుతం 30 చోట్ల చెత్త వేసే ప్రదేశాలను గుర్తించినట్లు అధికారులు తెలుపగా, వాటి సంఖ్యను పూర్తిగా తగ్గించి అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత మున్సిపాలిటీగా చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలు చికెన్ షాపులు, చేపల మార్కెట్ ద్వారా వచ్చే వ్యర్థాలను బయట వేయకుండా, వ్యర్థాలన్నింటిని క్రమ పద్ధతిలో డిస్పోజ్ చేసేందుకు మున్సిపల్ కమిషనర్ చర్య తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా చెత్త బయట వేస్తే పెనాల్టీ విధించాలని, చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దడంలో శానిటేషన్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇందుకు మున్సిపల్ ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించాలని చెప్పారు. ప్రతిరోజు మున్సిపాలిటీ పరిధిలో ఫాగింగ్ నిర్వహించాలని, నేటి శుక్రవారం నుండి ఫ్రైడే డ్రైడే చేపట్టాలని ఆదేశించారు. అక్టోబర్ 2 నుండి ప్రతి ఇంటి నుండి చెత్తను నాలుగు రకాలుగా సేకరించేందుకు చెత్త బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వాడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు హాని కలిగించే ప్లాస్టిక్ ను వినియోగించవద్దని, బయోడిగ్రేడబుల్ కవర్లు లేదా బట్ట సంచులు వాడేలా షాపుల్లో యజమానులకు సూచించాలని, ఒకవేళ ఒకటికి రెండు సార్లు చెప్పిన వినకపోతే సదరు షాపులను సీజ్ చేయాలని ఆదేశించారు. మిర్యాలగూడ



మున్సిపాలిటీ లో పైలట్ పద్ధతిలో నిర్వహిస్తున్న నక్ష సర్వే వేగవంతం చేయాలని, ముఖ్యంగా వారంలోపు ఆర్ఓఆర్ ఎంట్రీలను పెంచాలని, ఏ రోజుకు ఆరోజు డేటా ఎంట్రీని పూర్తి చేయాలని, భూములకు సంబంధించి సర్వే మాత్రం మిగిలి పోయి ఉన్నందున సర్వే నిర్వహించే విషయాన్ని ముందే సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలని చెప్పారు. నక్ష సర్వేలో భాగంగా 32 బ్లాక్లకు గాను ఇప్పటివరకు 25 బ్లాక్లు పూర్తి చేయడం జరిగిందని, 356 బ్లాకులకు గాను 332 పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. 1225 ఎకరాల సర్వే చేయాల్సి ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు 30 డేటా ఎంట్రీ పూర్తి చేసేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు . మున్సిపాలిటీలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రతి ఇంటికి, ప్రభుత్వ సంస్థలకు ,అన్నిచోట్ల తాగు నీరు వచ్చేలా వార్డు అధికారులు చూడాలని, ఎవరికీ ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ఇండ్ల సమాచారం వార్డు అధికారుల దగ్గర ఉండాలని, ఇకపై వార్డు అధికారులతో వార్డు ప్రొఫైల్ లేకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అమృత్ కింద చేపట్టిన తాగునీటి ఓహెచ్ఎస్ఆర్లను డిసెంబర్ లోపు పూర్తి చేయాల్సిందిగా పబ్లిక్ హెల్త్ సూపరింటిండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఏజెన్సీలను ఆదేశించారు .

మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయమైన ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, 16 కోట్ల రూపాయలకు గాను కేవలం 20 శాతం మాత్రమే వసూలు చేయడం జరిగిందన్నారు. వార్డు అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పన్నును వసూలు చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు పడేందుకు అవకాశం ఉన్నందున వనమహోత్సవం కింద మొక్కలు నాటాలని, ఈనెల 20 శాతం లక్ష్యాలు సాధించేందుకు దృష్టి సారించాలన్నారు.

మున్సిపాలిటీలో చేపట్టిన రోడ్లు, సెంట్రల్ మీడియన్, ఫ్లైఓవర్ సుందరీకరణపై కలెక్టర్ సమీక్షించారు. మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో చేపట్టిన తాగునీటి పనులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలని అన్నారు. అలాగే గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో కామాటీలను, జవాన్లను తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం వారిలో కొంతమందికి వయస్సు మళ్ళీనందున కామాటిల ఏర్పాట్లపై చర్య తీసుకోవాలని కలెక్టర్ తో కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో హాస్పిటల్, బస్టాండ్, కూరగాయల మార్కెట్, వైకుంఠధామం, తదితర ప్రదేశాల వద్ద ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. శానిటేషన్ పైనే ప్రజల ఆరోగ్యం ఆధారపడి ఉందని , ఇందుకు ప్రజాప్రతినిధులుగా తాము కూడా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అధికారులు మున్సిపల్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి రోజు తాగునీరు, విద్యుత్ పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని ఎన్ఎస్పి క్యాంపు, చింతపల్లి, ఆడవిదేవులపల్లిలో స్థలాలు ఉన్నందున సబ్ స్టేషన్ల మంజూరుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ తో కోరారు. అలాగే విద్యుత్తు సమస్య లేకుండా విద్యుత్ స్తంభాలు వైర్ల కోటా మిర్యాలగూడ కు రావడంలేదని, ఈ విషయంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణం మొత్తం రహదారులపై తోపుడు బండ్లు, చిరు వ్యాపారాలు చేసుకునేవారు స్థలాలను ఆక్రమించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తో కోరారు. మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ ,వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, జడ్పి సీఈఓ ప్రేంకరణ్ రెడ్డి, ఆర్డిఓ ఎస్.రమణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ నర్రా శ్రీజరెడ్డి ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# లబ్ధిదారుల ముంగిట ప్రగతి ఫలాలు

**మొదటి పేజీ తరువాయి...**

అందించే విధంగా అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార , గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి కోటపల్లి, చెన్నూర్, భీమారం, జైపూర్ మండలాల తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో వివిధ రకాల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో నీటి ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్మాణ పనులు చేపడుతున్నామని, ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగునీటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా



సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లను కేటాయించడం జరుగుతుందని, ప్రతి నియోజక వర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగర అభివృద్ధి నిధులతో మున్సిపల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సి.సి. రోడ్లు, మురుగు కాలువల వ్యవస్థ, నీటి ట్యాంకులు, విద్యుత్ స్తంభాలు తదితర మౌలిక వసతుల పనులను చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖల అధికారులతో ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి పనులలో జాప్యం లేకుండా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుత్తేదారులకు కేటాయించిన పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే సంవత్సరం జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి పుష్కర ఘాట్ల ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణం, ప్రజా సౌకర్యాల కల్పన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ముప్పై ఏళ్ల దర్గా రోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం..

**అభివృద్ధి నిరోధకులను ప్రజలు తిరస్కరించాలి**

**రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, రూ.30 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.**

**విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహార చెక్కు అందజేత...**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా 48వ డివిజన్ పరిధిలో గత మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట దర్గా రోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ



నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం దర్గా ఉత్సవాల సమయంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ. 30 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.

శంకుస్థాపనల అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట దర్గా రోడ్ సమస్య దశాబ్దాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. బోడగుట్ట, కడిపికొండ, ఇందిరానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రజలు ఈ రహదారిపై ఆధారపడుతున్నారని, గతంలో ఈ సమస్యపై అనేక ధర్నాలు, ఆందోళనలు, పోలీసు పికెటింగ్‌లు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. దర్గా పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో సమస్యకు పరిష్కారం లభించడం సంతోషకరమని అన్నారు. నెల రోజుల్లో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన గడువు విధించినట్లు తెలిపారు.

అదేవిధంగా ఆర్‌ఈసీ రోడ్ నుంచి బయటకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి సుమారు రూ. 20 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఆ ప్రతిపాదనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, ఎంపీ డాక్టర్ కావ్యతో పాటు సంబంధిత మంత్రులతో కూడా ఈ అంశంపై చర్చించినట్లు వెల్లడించారు.

అనంతరం ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పోతురవేణ శివకుమార్ కుటుంబానికి అండగా నిలిచేందుకు విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ. 5 లక్షల ఆర్థిక పరిహార చెక్కును ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# ఆగస్టు 6ను తెలంగాణ అస్తిత్వ దినంగా గుర్తించాలి

**వి ఆర్ పి ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎగ్గోజు రవీంద్ర చారి డిమాండ్**

**కాశీబుగ్గ , అక్షిత న్యూస్ :** ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని అధికారిక వేడుకగా నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ రిజర్వేషన్ పోరాట సమితి వి.ఆర్.పి.ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎగ్గొజు రవీంద్ర చారి డిమాండ్ చేశారు. కాశిబుగ్గలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణం పోసిన సిద్ధాంతకర్త, కోట్లాది ప్రజల గొంతుగా మారిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ 90వ జయంతి ఆగస్టు 6ఈ చారిత్రాత్మక రోజును రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అస్తిత్వ దినంగా"అధికారికంగా ప్రకటించి, ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించాలని ఉద్యమ కారులు, విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**ఆయన ఒక వ్యక్తి కాదు - ఒక ఉద్యమం**

తెలంగాణ వెనుకబాటుతనానికి గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి, "దోపిడీ సిద్ధాంతం"ను ప్రపంచానికి పరిచయం చేసిన మేధావి జయశంకర్ సార్.తొలి దశ ఉద్యమం నుంచి మలిదశ ఉద్యమం వరకు ఆయన రచనలు, ఉపన్యాసాలు, త్యాగం లేకుండా తెలంగాణ సాధ్యమయ్యేది కాదు. ఆయన



తన వ్యక్తిగత జీవితాన్ని తెలంగాణ కోసం తాకట్టు పెట్టారు. పెళ్లి చేసుకోలేదు. కుటుంబం ఏర్పరచుకోలేదు. తన యవ్వనమంతా పుస్తకాలకు, ఉద్యమ గోడలకు, ప్రజల చైతన్యానికి అంకితమిచ్చారు. తెలంగాణ అంటేనే జయశంకర్, జయశంకర్ అంటేనే తెలంగాణ,అనే నినాదం నేటికీ ప్రతి తెలంగాణ బిడ్డ నోట వినిపిస్తుంది.

**ప్రభుత్వం తక్షణం అమలు చేయాల్సిన డిమాండ్లు:**

అధికారిక గుర్తింపు: ప్రతి సంవత్సరం ఆగస్టు 6ను "తెలంగాణ అస్తిత్వ దినంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టాలి. విద్యార్థులకు సెలవు:ఈ రోజును విద్యార్థులకు అధికారిక సెలవు దినంగా ప్రకటించాలి. పాఠశాలలు, కళాశాలల్లో జయశంకర్ సార్ జీవితం, త్యాగం, తెలంగాణ ఉద్యమ చరిత్రపై ప్రత్యేక సెమినార్లు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి.

హైదరాబాద్‌లో ఆయన పేరుతో పరిశోధనా కేంద్రం మరియు ప్రతి జిల్లా కేంద్రంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి. తద్వారా రాబోయే తరాలకు ఆయన ఆశయాలు

పాఠ్యాంశాల్లో చేర్చాలి జయశంకర్ సార్ రచనలను డిగ్రీ, పీజీ స్థాయిలో పాఠ్యాంశాలుగా చేర్చి, యువతకు ఉద్యమ స్ఫూర్తిని అందించాలి.

ఒకవైపు తెలంగాణ సాధించుకున్నాం. కానీ సాధించిన తెలంగాణను నిలబెట్టుకోవాలంటే జయశంకర్ సార్ చూపిన బాటలోనే నడవాలి. ఆయన కలలు కన్న స్వయం సమృద్ధి తెలంగాణ, నీళ్లు-నిధులు-నియామకాల తెలంగాణను సాధించడమే ఆయనకు మనమిచ్చే అసలైన నివాళి.

ఉద్యమం ఆగిపోలేదు – ఆశయం బతికే ఉందిని అన్నారు.

## ఆత్మీయుడికి కన్నీటి వీడ్కోలు

**మనిషి వెళ్ళిపోయాడు**

**మంచితనం మిగిల్చి వెళ్ళాడు**

**మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ నివాళి**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం, వెన్నచర్ల గ్రామం లో మంచి మనసున్న మనిషి అంటే బండారి శేఖర్. ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండేవారు. గ్రామంలో అందరితో ఆప్యాయంగా ఉండేవారు. అలాంటి బండారి శేఖర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మనందరినీ విడిచి తుదిశ్వాస విడిచారు. ఈ వార్త విని గ్రామమంతా దుఃఖసాగరంలో మునిగిపోయింది. ఈ విషాద వార్త తెలుసుకున్న వెంటనే మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ వెన్నచర్ల గ్రామంలోని బండారి శేఖర్ స్వగృహానికి వెళ్లారు. వారి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సూర్య ప్రతాప్ గౌడ్ కన్నీటితో మాట్లాడుతూ, బండారి శేఖర్ తో నాకు ఎన్నో సంవత్సరాల ఆత్మీయ అనుబంధం ఉంది. ఆయన నవ్వుతూ అందరితో కలిసిపోయే స్వభావం, ఎవరికి ఏ సమస్య వచ్చినా సహాయం చేసే గుణం మాకు ఎప్పటికీ గుర్తుంటుంది.గ్రామ అభివృద్ధిలో, పండుగల్లో, కష్టసుఖాల్లో ఆయన పాత్ర మరువలేనిది. ఇలాంటి మంచి మనిషిని కోల్పోవడం మాకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నాను. అని ఆవేదన వ్యక్తం చేశారు. శరీరం నశించవచ్చు కానీ, ఆయన చేసిన మంచి, ఆయన మిగిల్చిన జ్ఞాపకాలు మన మధ్య ఎప్పటికీ ఉంటాయి అని సూర్య ప్రతాప్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బై రాములు, గ్రామ నాయకుడు వి. బాలింగాచారి, వార్డు సభ్యులు వంగూరి రామ్ ప్రసాద్, కోళ్ల సుదర్శన్, దేవరపాగ మంజుల దేవరాజ్, ఓర్సు నాగమ్మ, చిన్న సుల్తాన్, బైని శివలీల బాబు, కారోబార్ భాస్కర్, ఎం.డి. సలీమ్, ఎం.డి. కరీం, బండరాయిపాకుల రవి నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలమాలలు వేసి, కన్నీటితో వీడ్కోలు పలికారు.

## మహిళా సాధికారతకు కుట్టు మిషన్ల పంపిణీ అభినందనీయం

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరంలోని 12వ డివిజన్ రామచంద్రపూర్ కాలనీ అభయ మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అభయ మహిళా సాధికార కేంద్రం మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అందించి, అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేసింది. నగర మేయర్ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసి, వారి స్వయం ఉపాధి మరియు ఆర్థిక స్వావలంబనకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.మహిళలు నైపుణ్యాలను పెంపొం దించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మహిళా సాధికారతకు సేవలందిస్తున్న అభయ మహిళా సాధికార కేంద్రం నిర్వాహకులను మేయర్ అభినందించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, అభయ మహిళా సాధికార కేంద్రం నిర్వాహకులు బాలచంద్ర స్వామీజీ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వెలిశాల గ్రామంలో విద్యా, ఆరోగ్య ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

### పాఠశాలను సందర్శించి బోధనను సమీక్షించిన సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్

### అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా తల్లి పాల వారోత్సవాల అవగాహన సదస్సు



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల పరిధిలోని వెలిశాల గ్రామ పంచాయతీలో విద్యా, ఆరోగ్య ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యార్థుల పురోగతిపై గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ సమీక్ష నిర్వహించారు. వెలిశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యా పురోగతిని పరిశీలిస్తూ, ఉపాధ్యాయులతో కలిసి తరగతి గదులను సందర్శించి బోధన విధానంపై సర్పంచ్ సమీక్షించారు. అదేవిధంగా, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాల ఆవరణలో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేకంగా యాంటీ లార్వా, దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. గ్రామపంచాయతీ సెక్రటరీ అరుణ్ పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్య రక్షణ, నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి కొనసాగుతోంది.

ఇదే క్రమంలో వెలిశాల అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశువు జన్మించిన తొలి గంటలోనే ముర్రుపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించడం వల్ల శిశువుకు లభించే పోషకాలు, రోగనిరోధక శక్తి మరియు ఆరోగ్య ప్రయోజనాల గురించి తల్లులకు ఈ సందర్భంగా వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. "విద్యార్థుల ఆరోగ్యం, నాణ్యమైన విద్య ఎంత ముఖ్యమో, తల్లి–శిశు ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. 'ఆరోగ్యవంతమైన తల్లి -- ఆరోగ్యవంతమైన బిడ్డ -- ఆరోగ్య తెలంగాణ' అనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం తల్లి, శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేస్తూ, ప్రతి విద్యార్థికి సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉన్నాం. గ్రామంలో పోషకాహారం, పరిశుభ్రత మరియు ప్రజారోగ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ గ్రామ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి కొనసాగుతోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామపంచాయతీ సెక్రటరీ అరుణ్, ఎ ఎన్ ఎం వెంకటమ్మ, ఆశా వర్కర్లు శోభ, పూలమ్మ, అంగన్వాడీ టీచర్లు సురక్షిత, వీరమ్మ, ఎల్లమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ ఆయాలు, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు చిన్నారుల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

### మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** జీవితం జీవించడానికే గానీ ఆత్మహత్యలకు కాదు అని, ఎలాంటి కష్టాలు ఎదురైనా ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వైఫల్యాలను తాత్కాలికంగా భావించి, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని జీవితంలో విజయం సాధించాలని ఆయన సూచించారు. గెలిస్తేనే నిజమైన ఘనత లభిస్తుందని, ఆత్మహత్య సమస్యను సమాజమంతా కలిసి ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని అన్నారు.బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్, కరపత్రాలను మేయర్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఆత్మహత్యల నివారణ కమిటీ మరియు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా గత 20 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యల నివారణ కోసం నిరంతరం కృషి చేస్తూ ఇప్పటివరకు 28 మంది ప్రాణాలను కాపాడడం అభినందనీయమన్నారుసమాజంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఇటీవల పోలీసు శాఖలో చోటుచేసుకుంటున్న ఆత్మహత్యల ఘటనలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర పోలీసు డీజీపీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో పోలీసు సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించడం మంచి నిర్ణయమన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కూడా విస్తృత స్థాయిలో మానసిక ఆరోగ్య, ఒత్తిడి నిర్వహణ, ఆత్మహత్యల నివారణపై కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ, ఆత్మహత్య ప్రయత్నం చేసే వ్యక్తుల పట్ల సమాజం మరింత సానుభూతితో వ్యవహరించాలని అన్నారు. అలాంటి వ్యక్తులకు మానసిక ధైర్యాన్ని నింపడం, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఒక వ్యక్తికి అన్ని మార్గాలు మూసుకుపోయినట్లు అనిపించినప్పుడు మాత్రమే ఆత్మహత్య అనే ప్రమాదకర ఆలోచన కలుగుతుందని, అలాంటి సమయంలో 'మేమున్నాం' అనే భరోసా కల్పిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు.

ఆత్మహత్యలను నివారించడంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, సహచర ఉద్యోగులు, సామాజిక సంస్థలు, వైద్య నిపుణులు కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. మానసిక ఒత్తిడి, నిరాశ, ఒంటరితనం వంటి సమస్యలను చిన్నచూపు చూడకుండా అవసరమైన కౌన్సెలింగ్, వైద్య సహాయం పొందేలా ప్రోత్సహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజా తెలంగాణ పత్రిక చీఫ్ ఎడిటర్ ఆడెపు సంపత్, 28వ డివిజన్ కార్పొరేటర్ భాస్కర్ నాయక్, ఆత్మహత్యల నివారణ కమిటీ సభ్యులు, ఆరోగ్య మిత్ర ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువజన ప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## నిరుపేదల పాలిట వరం సీఎం సహాయనిధి

### రూ.1.50లక్షల విలువైన ఎల్ఓసి చెక్కు అందజేత

### సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని నిరుపేదల పాలిట సీఎం సహాయనిధి వరం లాంటిదని దేవలమ్మ నాగారం సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన సిలివేరు పద్మమ్మకు మంజూరైన రూ. 1. 50లక్షల విలువైన ఎల్ఓసి చెక్కును కుటుంబ సభ్యులకు బుధవారం సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన సిలివేరు పద్మమ్మ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుందని విషయం తనకు తెలిసిన వెంటనే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే ఆయన స్పందించి చికిత్స నిమిత్తం రూ. 1. 50లక్షల విలువైన ఎల్ఓసిచెక్కును మంజూరు చేయించారని తెలిపారు.ఆపద సమయాల్లో నిరుపేదలను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ముందంజలో ఉంటారన్నారు. చెక్కు మంజూరీకి సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాలయ చైర్మన్ పన్నాల రాజిరెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, కాంగ్రెస్ నాయకుడు రాసాల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రాపురంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**నడిగూడెం, అక్షిత న్యూస్:** మండలంలోని కాగిత రామ చంద్రాపురం గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అంగన్వాడి ఉపాధ్యాయులు దోసపాటి ప్రమీల,అలుగుపల్లి లక్ష్మి సమక్షంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చక్రాల ఉమా పిచ్చయ్య, మండల వైద్యాధికారి రమేష్ బాబు,సూపర్వైజర్ విజయ్ ,స్థానిక జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొల్లు నాగేశ్వరరావు,సైదులు అంగన్వాడి కేంద్రాలకు సంబంధించిన గర్భిణీ స్త్రీలు ,బాలింతలు, చిన్నారి బాలబాలికలు,స్థానిక వైద్య సిబ్బంది మహేశ్వరి,అల్లాడి పద్మ ఆశా కార్యకర్తలు ఉమ , ధనలక్ష్మి,కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## సర్వయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంట

### సర్పంచ్ గోసుల రాజేష్



**నడిగూడెం, అక్షిత న్యూస్:** మండలం లోని చెన్నకేశవపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త పచ్చి గొల్ల సర్వయ్య మరణించడం జరిగింది ఆ కుటుంబాన్ని సర్పంచ్ గోసుల రాజేష్ పరామర్శించారు.ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పారు.ఈరోజు 5000 రూపాయలు ఆర్థిక సాయం కుమారుడు పచ్చిగోళ్ళ నరేష్ కి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అనంతుల ఉపేందర్ వార్డు సభ్యులు పప్పులఉపేందర్ పచ్చిగోళ్ళ స్వరూప ఆర్ఎంపీ డాక్టర్ కొత్త ఉపేందర్ పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక



# సైబర్ నేరాల పట్ల అవగాహన, సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్**

**"సురక్షా కా తిరంగా - స్టే అలెర్ట్, స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్ " సందేశంతో విస్తృత సైబర్ అవగాహన కార్యక్రమం**

**"సురక్షా కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ" ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ**






**జగిత్యాల అక్షితబ్యూరో:** తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే "సైబర్ జాగ్రూక్తా దివస్" కార్యక్రమంలో భాగంగా, "సురక్ష కా తిరంగా -- స్టే అలెర్ట్, స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్" అనే ప్రత్యేక సందేశంతో జగిత్యాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం కోరుట్ల పట్టణంలోని పీబీ ఫంక్షన్ హాల్ లో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్ పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, డిజిటల్ భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలు, వాటి నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఫేక్ లింకులు, మోసపూరిత ఫోన్ కాల్స్, సోషల్ మీడియా మోసాలు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడి మోసాలు, క్యూ ఆర్ కోడ్ స్కామ్‌లు, ఓటీపీ మోసాలు, ఆన్‌లైన్ గేమింగ్ మోసాలు తదితర



అంశాలపై సవివరంగా వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో, అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా ద్వారా నకిలీ అకౌంట్లు, ఫేక్ లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, గిఫ్ట్ ఆఫర్లు, లక్కీ డ్రా పేర్లతో మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు లేదా లింకులను నమ్మవద్దని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్, ఆధార్ వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అలాగే వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు.

ఆన్‌లైన్‌లో ఏదైనా అనుమానాస్పద లావాదేవీలు లేదా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, అలాగే 'డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు. సైబర్ క్రైమ్.గవ్.ఇన్' పోర్టల్ లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే ఆర్థిక నష్టాన్ని తగ్గించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగంపై వారికి అవగాహన కల్పించాలని కోరారు.

విద్యార్థులు ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలకు కూడా తెలియజేసి సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి, సైబర్ మోసాలకు నేరస్తులు అనుసరిస్తున్న కొత్త పద్ధతులు ఏమిటి, వాటి పట్ల ప్రజలు ఎలాంటి అప్రమత్తతతో వ్యవహరించాలనే అంశాలను విద్యార్థులు నాటిక రూపంలో అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటిక ద్వారా సైబర్ నేరాలపై అవగాహనతో పాటు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను సందేశాత్మకంగా వివరించారు. సైబర్ భద్రతపై చైతన్యం కలిగించేలా నాటికను ప్రదర్శించిన విద్యార్థులను జిల్లా ఎస్పీ అభినందించి, వారి ప్రతిభను ప్రశంసిస్తూ బహుమతులను ప్రదానం చేశారు.

సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఆగస్టు--2026 స్వాతంత్ర్య మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు గంగారం, రవికిరణ్, సైబర్ క్రైమ్ ఎస్ఐలు కృష్ణ, దినేష్, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** నగరంలోని కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ సంప్రదాయ బద్ధంగా బోనం ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదల తో ఉండాలని ప్రార్థించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే విశిష్టమైన పండుగ అని మేయర్ పేర్కొన్నారు. కళాకారులు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. మన పండుగలు సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని, భావితరాలకు సంప్రదాయాలను అందించడంలో కళాకారుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు, యువకులు, కళాకారులతో మేయర్ మమేకమై వారి అభినందనలు స్వీకరించారు. సంప్రదాయ డప్పు వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. నగరంలో బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, మున్సిపల్ సిబ్బందికి మేయర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, కళాకారులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కై మూడు పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రిటైర్డ్ హెచ్ఎం తలసాని వెంకట చల్మా రెడ్డి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామ కాంగ్రెస్ నాయకులు రిటైర్డ్ హెచ్ఎం వెంకట చల్మా రెడ్డి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కై విద్యాభివృద్ధికి ప్రోత్సాహంగా మార్చాల గ్రామంలోని మూడు పాఠశాలల విద్యార్థులకు పెన్సిళ్లు, రబ్బర్లు, షార్పనర్లు ఈ కార్యక్రమం ద్వారా క్రింది పాఠశాలలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, హరిజనచేరి పాఠశాల ల విద్యార్థులకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వెంకట చర్మ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో మరింత రాణించాలని ఆకాంక్షిస్తూ వారి విద్యాభివృద్ధికి తన వంతుగా ఈ విద్యా సామాగ్రిని అందజేస్తు

ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు గతంలో మా నాన్న కొండారెడ్డి పేరు మీద స్కూల్స్ నిర్మించడం స్కూల్లకు కావలసిన అన్ని సదుపాయాలు సమకూర్చడం జరిగింది నేను కూడా విద్యార్థుల భవిష్యత్ కై సహాయ సహకారాలు అందిస్తానని తెలియపరచడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిజాముద్దీన్, ఏ రాంరెడ్డి వార్డు సభ్యులు సికిందర్ మాజీ వార్డు సభ్యులు దున్న భాస్కర్ యువ నాయకులు ఫక్రుద్దీన్ పాల్గొన్నారు

## జర్నలిస్టు సమాజానికి ఎమ్మెల్యే మేఘా చేయూత

**సురవరం ప్రతాప్ రెడ్డి ప్రెస్ క్లబ్‌కు రూ.20 లక్షలు మంజూరు**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ క్లబ్ శాశ్వత భవన నిర్మాణానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ. 20 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేశారు. ఇటీవల వనపర్తి ప్రెస్ క్లబ్ కు శాశ్వత భవనం కావాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి విన్నవించగా స్పందించిన మంత్రి అప్పటికప్పుడే నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రకటన చేశారు. ఎమ్మెల్యే సూచన మేరకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అడ్మినిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి బుధవారం 20 లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రోసిడింగ్ జారీ చేశారు. ఈ సందర్భంగా వనపర్తి జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టులకు తగిన వసతులు, సౌకార్యాలు కల్పించడం మా కర్తవ్యం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ శాశ్వత భవనం త్వరగా నిర్మాణం చేయించి అందజేస్తాని తెలిపారు. నిధుల మంజూరుపై సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు,కార్యదర్శి, సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం జర్నలిస్టుల ఐక్యతకు, వృత్తి అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి 61వ జన్మదిన వేడుకలు



**తాండూరు, అక్షిత ప్రతినిధి:** తాండూరు ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి 61వ జన్మదినాన్ని పురస్క రించుకుని, పెద్దేముల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి. మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పి. మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసేవలో నిరంతరం ముందుండే ఎమ్మెల్యే మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పిస్తూ, ఆయనకు మంత్రి పదవి రావాలని కోరుకున్నారు. పెద్దేముల్ మండల అభివృద్ధికి, ముఖ్యంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం అధిక నిధులు మంజూరు చేయడంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపారని, తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అన్నదాన కార్యక్రమానికి విరాళంగా మొదటి వేతనం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** కొత్తకోట పట్టణం లోని శ్రీ హరిహారపుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం లో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి గాను పట్టణానికి చెందిన విశ్వనాథం మాధవి గంగాధర్ కూతురు విశ్వనాథం నిహారిక ఇటీవల ఉద్యోగం లో చేరగా తనకు వచ్చిన మొదటి వేతనం యాభై ఒక్క వెయిల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేసింది. మన జీవితంలో మొదటి వేతనం అనేది ఎంతో విలువైనది. ఆ మొదటి సంపాదన దైవకార్యాలకు విరాళంగా సమర్పించడం మన భారతీయ సంస్కృతిలో ఒక గొప్ప ఆచారం.

ఇలా సమర్పించడం వల్ల దేవుని పట్ల కృతజ్ఞతను వ్యక్తపరుస్తాం. మనకు ఉద్యోగం, ఆరోగ్యం, అవకాశాలు కల్పించిన భగవంతుని ఆశీస్సులను స్మరించుకుంటూ, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నానని ఇది కేవలం తన మొదటి వేతనం కాదని 22 సంవత్సరాల శ్రమకు ఫలితం అని ఇట్టి విరాళాన్ని నిత్యపూజలు, అన్నదానం, ధార్మిక కార్యక్రమాలు, దేవాలయ నిర్వహణ వంటి సేవలకు ఉపయోగించాలని మన చిన్న సహాయం కూడా ఎంతో మందికి మేలు చేస్తుందని అందుకే, ప్రతి ఒక్కరూ తమ మొదటి వేతనం లేదా మొదటి సంపాదన భక్తిశ్రద్ధలతో ఆలయానికి సమర్పించి, దైవానుగ్రహాన్ని పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలపడం విశేషం. ఈ సందర్భంగా అయ్యప్ప సేవసమితి అధ్యక్షులు ధూపం నాగరాజు , పొగాకు అనీల్ కుమార్ , బలిజ లింగేశ్వర్ , భీమ కిషోర్ , వేముల సుధాకర్ రెడ్డి , లక్ష్మీనారాయణ యాదవ్ తదితరులు నిహారికను అభినందించి శాలువాతో సన్మానించారు.

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసిన బోడుప్పల్ కాంగ్రెస్ నేతలు



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, ఆగస్టు 5:** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ బుధవారం కలిశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మక్ కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన పొగుల దిలీప్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబుకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డివిజన్ అధ్యక్షులకు అభినందనలు తెలియజేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కార్యకర్తలతో సన్నిహితంగా ఉంటూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా నూతన అధ్యక్షులు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తారని తెలిపారు. డివిజన్‌ల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ కార్యక్రమాల విజయవంతమైన అమలులో సమిష్టిగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బి-బ్లాక్ జనరల్ సెక్రటరీ కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రైస్ మిల్లులలో విజిలెన్స్ దాడులు జరగాలి

### సియంఆర్ బియ్యం అమ్ముకున్న వారిపై పిడి యాక్ట్ పెట్టాలి

### గుంజపడుగు హరిప్రసాద్

### జిల్లా అధ్యక్షులు తెలంగాణ రక్షణ సేన




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పౌరసరఫరాల అధికారులు పెద్దఎత్తున అక్రమాలు చేసిన వారిని వదిలి చిన్న రైస్ మిల్లుల మీద దాడులు చేసి కేసులు పెట్టి పెద్దవారిని వదిలి పెడుతున్నారని బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ప్రభుత్వం పెద్దలు నిర్వహించిన సమీక్ష సమావేశంలో సివిల్ సప్లయ్ వ్యవస్థకు తూట్లు పొడిచిన వారిని, అనేక అక్రమాలకు అన్యాయాలకు పాల్పడిన వారిని పక్కన కూర్చోబెట్టుకుని సమీక్ష చేయడంలో అర్థం ఏమిటని వారు అన్నారు. కరీంనగర్ జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు మరియు కొందరు బడా రైస్ మిల్లర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోచుకుంటున్న తీరును ప్రతిపక్ష పార్టీ కూడ మూగబోయయిఅని ఇంతా పెద్దఎత్తున సియంఆర్ బియ్యం గల్లంతు కావడం అంటే దీనికి పూర్తి బాధ్యత అధికారులదేనని వారు అన్నారు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అక్రమార్కులకు కట్టబెడుతున్న కరీంనగర్ సివిల్ సప్లయ్ అధికారుల తీరుపై ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.

ఏసీకే బకాయిదారులు టెండర్ నిబంధనల ఉల్లంఘన చేసి జిల్లాలో వందల ఏసీకే బకాయిలు ఉన్నప్పటికీ, 2022-23 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం వేలంలో బకాయి డబ్బులు చెల్లించని వారికి మరియు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలలో ధాన్యం నిల్వ లేనట్లు తేలిన 25 శాతం పెనాల్టీ చెల్లించాలన్న నాటి సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూన్న వ్యక్తులకు మళ్లీ మళ్ళీ ధాన్యాన్ని కట్టబెట్టడంలో మతులాబు ఏమిటని వారు అన్నారు. చిన్న మిల్లర్లపై కక్షసాధింపు చర్యలు బడా మిల్లర్లకు నిబంధనలకు విరుద్ధంగా లాభం చేకురుస్తూ సామాన్య, చిన్న రైస్ మిల్లర్లపైన మాత్రం కావాలనే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం కేవలం 10 శాతం బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలని స్పష్టమైన సర్క్యులర్ జారీ చేసినప్పటికీ జిల్లాలో ఆనిబంధనను పక్కనపెట్టి అధికారుల అలసత్వం ప్రదర్శించడం వెనుక భారీ కుట్ర కోణం దాగి ఉందని వారు అన్నారు.

కొన్ని రైస్ మిల్లులలో స్టాక్ లేకుండానే అక్రమ షిఫ్టింగ్ కొంతమంది బడా రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వ లేకపోయినా, ఉన్నట్లు చూపించి 25 శాతం పెనాల్టీ పడకుండా పెద్ద ఎత్తున షిఫ్టింగ్ చేస్తూ ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారుల పైన త్వరలోనే ఆధారాలతో సహా పిర్యాదు చేస్తామని వారు అన్నారు.

కావున జిల్లా కలెక్టర్ వెంటనే ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, సమగ్ర విచారణ జరిపించి, ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపై మరియు మిల్లర్లపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి, జిల్లా నాయకులు రంగరవేణి లక్ష్మణ్, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, గర్షకుర్తి విద్యాసాగర్, నూతి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షులుగా కందిక చెన్నకేశవులు,

## ప్రధాన కార్యదర్శిగా గన్నారపు రమేష్ ఎన్నిక





**నర్సంపేట అక్షిత ప్రతినిధి:** కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా పనిచేస్తున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటీయూసీ వరంగల్ జిల్లా నాలుగో మహాసభలు మంగళవారం ఘనంగా ముగిశాయి. మహాసభల రెండవ రోజు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కార్మిక సంఘాన్ని మరింత పటిష్టం చేసేందుకు ముప్పై తొమ్మిది మందితో కూడిన నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ వివరాలను ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా నిర్మాణ బాధ్యులు తల్లా దేవేందర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు.

ఈ ఎన్నికల్లో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షులుగా కందిక చెన్నకేశవులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గన్నారపు రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభలకు కందిక చెన్నకేశవులు అధ్యక్షత వహించగా, జిల్లా గౌరవ అధ్యక్షులుగా పనస ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దండు లక్ష్మణ్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా గుంపెల్లి మునిశ్వర్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి జాన్ పాల్, ఎండి యాకుబ్, గుండె బద్రి, దడిగెల సంధ్యారాణి, సహాయ కార్యదర్శులుగా దామెర కృష్ణ, గోవర్ధన్, మియాపురం ఉప్పుల రవి, బోట్ల శ్రీనివాస్ బాధ్యతలను స్వీకరించారు. వీరితో పాటు పలువురిని కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ గత నూట ఆరు సంవత్సరాలుగా నిరంతరం పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. కార్మికులకు కనీస వేతనం ఇరవై ఆరు వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, డిఫెన్స్ రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలను ఆయన ప్రస్తావించారు.

ఆర్టీసీ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లు, సివిల్ సప్లై హమాలీలు, పెయింటర్ యూనియన్ కార్మికులు, వ్యవసాయ మార్కెట్ హమాలీలు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం జిల్లాలో సంఘాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారం కోసం నూతన కమిటీ అహర్నిశలు శ్రమిస్తుందని స్పష్టం చేశారు.

ఈ నూతన కమిటీ ఎన్నిక విజయవంతం కావడానికి సహకరించిన ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వానికి, రాష్ట్ర వర్కింగ్ జనరల్ సెక్రెటరీ మోటే నరసింహ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తల్లా దేవేందర్ రెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మీయా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్‌లకు నూతన అధ్యక్ష కార్యదర్శులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కమిటీ ఏర్పాటు ద్వారా కార్మికులకు తమ హక్కులపై అవగాహన కలగడమే కాకుండా, ప్రభుత్వాలు మరియు యాజమాన్యాల నుంచి రావాల్సిన న్యాయమైన వేతనాలు, సౌకర్యాల సాధనకు బలమైన వేదిక దొరికినట్లయింది. చిన్న గ్రామాల నుంచి పట్టణాల వరకు వివిధ రంగాల్లో పనిచేస్తున్న శ్రామికులు, కర్షకులు, ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ సంఘం అండగా నిలుస్తుందని నాయకులు తెలిపారు.

# మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యం దిశగా చర్యలు

## జిల్లా కలెక్టర్ కె.హరిత





**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో ఉన్నత స్థాయిలో నిలవాలని మహిళల ఆర్థిక స్వావలంబన కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు నేడు వ్యాపార రంగంలో రాణిస్తూ ఆర్థికంగా ఎదిగి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కుట్టు మిషన్లు, ఎంబ్రాయిడరీ మిషన్ల ద్వారా తమ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని, మహిళా సంఘాలను



ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా జిల్లాలో సుమారు 80 వేల మంది విద్యార్థులకు 2 జతల ఏకరూప దుస్తులు కుట్టే కార్యక్రమాన్ని అప్పగించడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ నిర్వహణ, రెబ్బెన మండలం నంబాల గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, బస్సుల కొనుగోలు ద్వారా ప్రతినెల ఒక్కొక్క బస్సుకు 70 వేల ఆదాయం, పెట్రోల్ బంకుల ఏర్పాటు పనులు చేపట్టడం ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించి చదివించాలని, ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలలో సభ్యులుగా చేరని వారిని గుర్తించి సభ్యులుగా చేర్పించి నూతన సంఘాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా మహిళా సంఘాల సభ్యులు సాధిస్తున్న విజయాలు, ఉత్పత్తులు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు.

ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళా సంఘాలు అదనపు ఆదాయం పొందేలా వ్యాపార రంగాలలో రాణించాలని, ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, మండల సమాఖ్య సభ్యులు, ఎ పి ఎం లు, సి సి లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పలుకుదాం

## కలిసి సైబర్ సురక్షిత తెలంగాణను నిర్మిద్దాం

**సోషల్ మీడియా వేదికగా వచ్చే పెట్టుబడి,జాబ్ సందేశాలు చూసి మోసపోవద్దు**

**స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో జరిగే సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

**అగు ఆలోచించు.... నిజం నిర్ధారించు..... సైబర్ భద్రత పెంచు.. అనే నినాదంతో విద్యార్థులతో కలసి పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ**

**విద్యార్థి దశ నుండే సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పలికి కలిసి సైబర్ సురక్షిత తెలంగాణను నిర్మిద్దాం అని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు**

**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** ఈసందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఆగస్టు–2026 స్వాతంత్ర్య మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న లి"సురక్ష కా తిరంగా – – సైబర్ స్వతంత్ర తెలంగాణ"లి సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో కలిసి సైబర్ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది.

ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...సైబర్ మోసాల పట్ల ప్రజలను, విద్యార్థులను అప్రమత్తం చేసి, సురక్షితమైన డిజిటల్ వినియోగంపై చైతన్యం కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసగిస్తున్నారని, అత్యాశకు లోనై వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని సూచించారు.సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధమని, అవగాహన ద్వారానే సైబర్ మోసాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు.

సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికల ద్వారా వచ్చే పెట్టుబడి, జాబ్ ఆఫర్లు, ముఖ్యంగా స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో చేసే మోసాలు, డిజిటల్ అరెస్ట్ అంటూ వచ్చే ఫోన్ కాల్స్, లోన్ యాప్స్, మొదలగు మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వచ్చిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థులు సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా ద్వారా





అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, స్నేహ అభ్యర్థనలకు స్పందించవద్దని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఎవరితో పంచుకోవద్దని తెలిపారు.

సైబర్ మోసానికి గురైన వెంటనే, ముఖ్యంగా గోల్డెన్ అవర్ (మొదటి గంట)లోనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు కాల్ చేసి లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని,గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్పీ తెలిపారు తెలిపారు.

"సురక్ష కా తిరంగా" ప్రచార సందేశమైన అప్రమత్తంగా ఉండండి, అవగాహన పెంచుకోండి, సైబర్ సురక్షితంగా ఉండండి అనే మూడు అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎస్పీ గారు పిలుపునిచ్చారు.

ఈకార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు,సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు గణేష్, నాగరాజు, జునైద్, సైబర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్ అక్షిత న్యూస్:** జిల్లా కేంద్రశీ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను బుధవారం అదనపు కలెక్టర్ (రెవిన్యూ )డి.శ్రీనివాస్ రెడ్డి రాజ కీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాశీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మార్వో రాజేష్ , బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి నాశీపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మిడిదొడ్డి కపిల్, మహమ్మద్ పహాద్, ఎంఐఎం పార్టీ ప్రతినిది మజిత్ హుస్సేన్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# రామన్నపేట మండల లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** నకిరేకల్ శాసనసభ్యులు, తెలంగాణ ప్రభుత్వ విప్ గౌరవనీయులు శ్రీ వేముల వీరేశం సహాయ సహకా రంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రామన్నపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, వార్డు సభ్యులు మోటే మహేష్, కందుల అండాలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ అంజిరెడ్డి, అక్క యాదయ్య, పిట్ట రామిరెడ్డి, శంబాల వెంకన్న, చింతల కృష్ణ, గొలుసుల ప్రసాద్, మాల్గ వెంకటేష్, బండ బాలయ్య, బొడ్డు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన లోలం శ్యామ్ సుందర్



**లోకేశ్వరం, ఆగస్టు 5 అక్షిత న్యూస్:** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన మాణిక్ రావు, మాతృమూర్తి ఇటీవల మరణించగా,బుధవారం వారి నివాసానికి వెళ్లిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు లోలం శ్యామ్ సుందర్,వారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా శ్యామ్ సుందర్,మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్ రావు,పిఎసిఎస్ మాజీ చైర్మన్ చిన్న రావు, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, పురుషోత్తం రావు,తదితరులు ఉన్నారు...

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY

గురువారం | 06| ఆగస్టు| 2026

## శిశువుకు అమ్మ పాలు అమృతం

**10వ వార్డు కౌన్సిలర్ దేప రమ్య రాజు**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ 10వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 10వ వార్డు కౌన్సిలర్ దేప రమ్య రాజు పాల్గొని మాట్లాడుతూ... తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని తెలిపారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాహారం అందడమే కాకుండా, రోగనిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు తొలి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలనే అందించాలని సూచించారు. తల్లిపాలను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యవంతమైన భావితరాన్ని నిర్మించవచ్చని, శిశువుకి అమ్మ పాలు అమృతం అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి వాటిని ప్రోత్సహించాలని కౌన్సిలర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌కు ఘన సన్మానం



**వరంగల్, అక్షిత బ్యూరో:** కాకతీయ యూనివర్సిటీ వద్ద డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌కు జైగౌడ్ ఉద్యమం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మార్క రవి గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఈసీ సభ్యులు డాక్టర్ చిర్రా రాజు గౌడ్, కాకతీయ యూనివర్సిటీ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ బొడిగే సతీష్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగిరి యాదగిరి గౌడ్, అనంతుల రమేష్ గౌడ్, జూలూరి రంజిత్ గౌడ్, కునూరు రంజిత్ గౌడ్, అలాగే బీసీ సంఘం నాయకులు చిర్రా సుమన్, మధు, నరేష్ తదితరులు పాల్గొని డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వారు మాట్లాడుతూ, విద్యారంగంలో, ముఖ్యంగా శారీరక విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శోభనాద్రిపురంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం అందజేశారు. నకిరేకల్ శాసనసభ్యులు, తెలంగాణ ప్రభుత్వ విప్ శ్రీ వేముల వీరేశం సహకారంతో మంజూరైన ఈ చెక్కులను పోషబోయిన నరసింహ, ఇప్ప మౌనికలకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచి మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏటెల్లి పరమేష్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు సతీష్, సునీత, రమణ, లతీఫ్, అంజమ్మ, కుమారస్వామి, మేకల స్వామి, మాజీ సర్పంచ్ బొడిగే చంద్రకళ శ్రీనివాస్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ నంగునూరు నరేష్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తాడూరి సైదులు, సాయి గౌడ్, సైదులు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**




**అక్షిత ప్రతినిధి , మంచిర్యాల:** జిల్లాలో రెవెన్యూ, పౌర సరఫరాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసిల్దార్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కోటపల్లి శివారులోని సర్వే నంబర్ 389లో 1.12 ఎకరాల విస్తీర్ణం గల భూమిని గుర్తించడం జరిగిందని, కార్యాలయ నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.



చెన్నూర్ మండల డిప్యూటీ తహసీల్దార్ తో కలిసి చెన్నూర్ లోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంను సందర్శించి ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యం తరలింపును ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని గోదాం నిర్వాహకులకు సూచించారు. వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం కోసం సరఫరా చేసే బియ్యాన్ని నాణ్యతతో సమయానికి పంపిణీ చేయాలని, రేషన్ కార్డుదారుల ఈ-కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. స్టేజ్-2 కాంట్రాక్టర్ తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి బియ్యం రవాణా, సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని సూచించారు.

అనంతరం హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ధ్రువపత్రాల జారీని నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని పెండింగ్ పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు - ప్రతి బిడ్డకు తొలి హక్కు

**సాతాపూర్‌లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు - చిన్నారుల అక్షరాబ్యాసం, అన్నప్రసన్న కార్యక్రమం**

**సర్పంచ్ కట్ట వంశీ గౌడ్**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామం లో ఆరోగ్యవంతమైన తల్లి ఆరోగ్యవంతమైన సమాజం అనే స్ఫూర్తితో బుధవారం సాతాపూర్ గ్రామంలోని 1వ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి సాతాపూర్ గ్రామ సర్పంచ్ కట్ట వంశీ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామంలోని తల్లులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వంశీ గౌడ్ మాట్లాడుతూ, తల్లిపాలు అనేది కేవలం ఆహారం మాత్రమే కాదు, అది ఒక బిడ్డకు దొరికే తొలి ప్రేమ, తొలి రక్షణ, తొలి టీకా. పుట్టిన మొదటి 6 నెలలు తల్లిపాలు మాత్రమే ఇస్తే బిడ్డకు సంపూర్ణ పోషణ, రోగనిరోధక శక్తి లభిస్తుంది. రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగిస్తే బిడ్డ శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతాడు. ప్రతి తల్లి ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. బిడ్డల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది అని తల్లులకు వివరించారు. ప్రభుత్వం పిల్లల కోసం ఎన్ని పథకాలు తెచ్చినా, తల్లి ఇచ్చే తల్లిపాలకు సాటి రావు. అందుకే ప్రతి ఇంటా ఈ అవగాహన రావాలి అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా అక్షరాబ్యాసం అక్షరం నేర్చుకుంటే అదృష్టం వస్తుంది అంటూ చిన్నారుల అక్షరాబ్యాస కార్యక్రమంలో సర్పంచ్ స్వయంగా పాల్గొన్నారు. చిన్నారుల చేతితో బియ్యంలో ఓం, అ ఆ అక్షరాలు రాయించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ చిన్నారులే రేపటి భారత భవిష్యత్తు అని అన్నారు. అన్నప్రసన్న 6 నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ స్వయంగా చిన్నారుల నోట్లో మొదటి ముద్ద అన్నం పెట్టి, వారు ఆరోగ్యంగా, చురుగ్గా ఎదగాలని దీవించారు. వస్త్రదానం కార్యక్రమానికి వచ్చిన చిన్నారులందరికీ క్రొత్త బట్టలు అందజేశారు. చిన్నారుల ముఖాల్లోని ఆనందం చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీమతి బాలిశ్వరమ్మ, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను సర్పంచ్ అభినందించి, గ్రామ అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రానికి ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

## అభిమానుల సందడి మధ్య ఘనంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**రక్తదాన శిబిరం, ప్రత్యేక గీతం ఆవిష్కరణ**




**తాండూరు, అక్షిత ప్రతినిధి:** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం అభిమానులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు పట్టణంలోని వైట్ ప్యాలెస్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని యునైటెడ్ వే బెంగళూరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి అత్యవసర వైద్య సేవల కోసం రూ.20 లక్షల విలువైన అత్యాధునిక అంబులెన్స్‌ను అందజేశారు. ఈ అంబులెన్స్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభి ప్రాయపడ్డారు. వేడుకల్లో భాగంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జీవిత ప్రస్థానం, ప్రజాసేవను ప్రతిబింబించేలా ప్రత్యేకంగా రూపొందించిన జన్మదిన గీతాన్ని ఆవిష్కరించారు.

తదుపరి భారీ సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే కుమారులు బుయ్యని శివకుమార్ రెడ్డి, బుయ్యని అవినాష్ రెడ్డి, అలాగే ఆయన సోదరుని కుమారుడు బుయ్యని ప్రణయ్ రెడ్డి కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ప్రజాసేవ మరింత విస్తరించాలని, ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, తాండూరు టౌన్ ప్రెసిడెంట్ బాతుల నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నరసింహులు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, పట్టణ నాయకులు, నియోజకవర్గ నాయకులు, ఎమ్మెల్యే అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.